క్లుప్తంగా

సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు


సీఐ వేణుగోపాల్ సమక్షంలో బైండోవర్ చేస్తున్న దృశ్యం

యల్లనూరు: మండలంలోని నిట్టూరులో సర్పంచ్ మార్పుపై ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో భోగాతి ప్రతాప్‌రెడ్డి వర్గంలోని జరుగు శ్రీనివాసులరెడ్డి, గంగారెడ్డి, నాగేంద్రరెడ్డి, రామాంజనేయులు, ఈశ్వరయ్య, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి వర్గంలోని వనం రవి, కేశవరెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, సంజీవరెడ్డిని మంగళవారం సీఐ వేణుగోపాల్, ఎస్ఐ రామకృష్ణ పోలీసుస్టేషన్‌లో బైండోవరు చేశారు. గ్రామంలో శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

యల్లనూరు: మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని పుట్లూరు సీఐ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం యల్లనూరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలను నిర్వహిస్తే సమాచారం తెలపాలన్నారు. ఎంతటివారినైనా వదిలే ప్రసక్తి లేదన్నారు. రౌడీషటర్లు కదలికలను ఎప్పటికప్పుడు నిఘా వేసి ఉంచాలని ఎస్ఐ రామకృష్ణకు తెలిపారు. పెండింగ్ కేసులను త్వరగతిన పూర్తి చేయాలన్నారు.

ఇళ్ల ప్రారంభానికి సిద్ధం చేయండి


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న


గుంతకల్లుటౌన్: జగనన్న లేఔట్లల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వాటి ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. మంగళవారం జగనన్న లేఔట్-1లో ఆయన పర్యటించారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. చివరి దశలో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులకు సకాలంలోనే బిల్లులను కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని, నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాలన్నింటినీ కల్పించామని పేర్కొన్నారు. అనంతరం ఆయన 24వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్ఓ నాసిర్‌హుసేన్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ మురళీ, భరత్, ఎల్ఎస్.బాషా, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుతో ఆర్థికాభివృద్ధి సాధించండి


డ్రెస్ మెటీరియల్ అందిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. మంగళవారం అమృతవర్షిణి బాలకళ్యాణ ఆశ్రమంలోని టైలరింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ పొందుతున్న 50 మంది మహిళలకు డ్రెస్ మెటీరియల్‌తో పాటు జూట్ బ్యాగులను అందజేశారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆధునిక మోడళ్లపై శిక్షణ పొంది ఆధునిక వస్త్రాల రూపకర్తలుగా తయారు కావాలన్నారు. మహిళల స్వయం సమృద్ధికి పాటుపడుతున్న ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యుల సేవలను అభినందించారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు త్రిస్లాబన్సాలీ, మెప్మా సిబ్బంది సుశీల, అంజనాలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాకారులతో సీఐ రామసుబ్బయ్య

గుంతకల్లు: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య అన్నారు. పట్టణంలోని ఎస్‌జేపీ క్రీడా మైదానంలో మంగళవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలు ముఖ్యమన్నారు. శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ క్రికెట్ కోచ్ ఇనయతుల్లా, పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అండగా నిలవండి

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

గుంతకల్లు రూరల్: నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎన్.తిమ్మాపురంలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తన కూతురు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, పార్టీ నాయకులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లిన ఎమ్మెల్యే నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నవరత్నాలు పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చారన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టసుఖాలను దగ్గర నుంచి చూసిన జగనన్న ఆ కష్టాల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడానికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలు అందించి ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసుకున్నారన్నారు. నాడు- నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్ది విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. నాలుగేళ్లు ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డ తాము ఇంకా ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని కూడా పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే గడప గడపకూ వచ్చి మీతో మాట్లాడుతున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీడీఓ జాషువా, ఎంపీపీ బీవీ మాధవి, సర్పంచ్ నీలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రావు, కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, నాయకులు బాబూరావు, నక్కా ఓబులేసు, రాజు, ప్రసాద్, సచివాలయ కన్వీనర్ షబ్బీర్, నాగాంజనేయులు, వీరనాగయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, కసాపురం మాజీ సర్పంచ్ తిక్కస్వామి, నక్కనదొడ్డి ఎంపీటీసీ ఆంజనేయులు అనంతయ్య, అంజి, రవిరెడ్డి, బెస్త మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవాలని, అండగా తానున్నానని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా కల్పించారు. సోమవారం పెద్దపేట గ్రామంలో జగనన్న స్టిక్కర్లపై టీడీపీ స్టిక్కర్లను తెలుగు తమ్ముళ్లు ఉద్దేశ పూర్వకంగా అతికిస్తుండగా యాడికి 18వ వార్డు సభ్యురాలు లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నేత రామకృష్ణారెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధైర్యంగా తెలుగు తమ్ముళ్లపై అస్మిత్‌రెడ్డి సమక్షంలోనే ఎదురు దాడికి దిగి ఎదుర్కోవటంతో జగనన్న స్టిక్కర్లపైన అతికించిన టీడీపీ స్టిక్కర్లను పోలీసులు జోక్యం చేసు కొని తొలగించారు. దీంతో మంగళవారం ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని ఘటనపై రామకృష్ణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో పలకరింపు కార్యక్రమంతో ప్రజల ఇంటి వద్దకు వెళ్లి ప్రజలను ఆకట్టుకోవాలే గానీ ఇలా వైఎస్సార్‌సీపీకి చెందిన స్టిక్కర్లపై టీడీపీ స్టిక్కర్లు ఆ గృహాల యజమానులకు తెలియకుండా అతికించటం సిగ్గుచేటన్నారు. గ్రామాల్లో ప్రజల మధ్య చిచ్చు పెట్టే కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు ఎంచుకున్నారన్నారు. ఇంకో పది నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని ప్రజలు, వైఎస్సార్‌సీపీకి చెందిన వారిని టీడీపీ వారు భయాందోళనకు గురిచేస్తారని, ఎవరూ అధైర్యపడొద్దని, అండగా తానుంటానని భరోసా కల్పించారు. అంతకుముందు ఎమ్మెల్యే యాడికిలో పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానంద రెడ్డి, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, నాయకులు నాగేష్, కోనా జగదీశ్వర రెడ్డి, కోనా వెంకట శివారెడ్డి, చలపతిరెడ్డి, సర్పంచులు పద్మనాభరెడ్డి, సంజీవరాయుడు, వెంకటరామిరెడ్డి, శివకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల విజేతలకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఆలిండియా సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన శ్రీశంకరానందగిరి డిగ్రీ కళాశాల విద్యార్థులకు మంగళవారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. చండీగఢ్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఏప్రిల్ 5 నుంచి 9 వరకూ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిధ్య వహించిన కళాశాల విద్యార్థులు సురేష్‌బాబు, ప్రసన్నకుమార్, నల్లన్న ప్రతిభ చాటి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్, కరస్పాండెంట్ కేసీ హరి, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

గుత్తి: పట్టణంలో అగ్ని మాపక కేంద్రం ఏర్పాటు చేయాలని గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని గుత్తి కోట సంరక్షణ సమితి కార్యాలయంలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్తిలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు గత మూడున్నర దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమైందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

పిడుగుపాటు బాధితురాలికి పరామర్శ


వనితను పరామర్శిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల: రెండు రోజుల క్రితం హెచ్.సోదనపల్లి గ్రామంలో పిడుగుపాటుతో ఓ యువతి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వనితను రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరామర్శించారు. యువతి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు, కుటుంబ సభ్యులతో ఆరా తీశారు. వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు. అధైర్య పడొద్దని ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తాడిపత్రి టౌన్: ఆవుల తిప్పాయిపల్లి ఓబులేసు కోనలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. అర్చకుల వేదమంత్రాల మధ్య లక్ష్మీదేవి, లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ విగ్రహాలకు శ్రీ విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యావచనం, క్షీరాభిషేకం, దీక్షా హోమం చేపట్టారు. సాయంత్రం ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి శేష వాహనంపై స్వామిని ఆలయ ఆవరణలో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: నల్లదాసరపల్లి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాషువా మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

గార్లదిన్నె: మండలంలోని జంబులదిన్నె, తలగాచిపల్లి, ఓబులాపురంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరవుతారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

5న మండల మీట్

తాడిపత్రి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5 న శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంగారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులందరూ వారి శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

5 నుంచి అంకాళమ్మ జాతర

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో ఈ నెల 5 నుంచి అంకాళమ్మ జాతర ప్రారంభం కానున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు 8న రాత్రి దూలం లాగుడు పోటీలను నిర్వహించనున్నారు. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.3వేలు చొప్పున అందించనున్నారు. వివరాలకు 9989525057, 9110513354 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పెద్దపేట ఘటనలో కేసు నమోదు

యాడికి: పెద్దపేట గ్రామంలో సోమవారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ నేత ఇంటి గోడలపై ఉన్న జగనన్న స్టిక్కర్లపై టీడీపీ స్టిక్కర్లు అతికించటమే కాకుండా దాడికి పాల్పడిన ఘటనలో టీడీపీకి చెందిన వారిపై పోలీసులుకేసు నమోదు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి సోమవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మంగళవారం పెద్దపేట గ్రామానికి చెందిన టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ రంగయ్య, తాడిపత్రికి చెందిన షఫీవుల్లాతో పాటు మరి కొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత


మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగరాజు

శింగనమల: మండలంలోని కల్లుమడికి చెందిన ఓ మహిళ కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వలంటీర్ అక్కడికెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. వివరాలు.. కల్లుమడికి చెందిన జయమ్మ అనారోగ్యంతో కర్నూలులోని ఒమేగా ఆసుపత్రిలో నాలుగు వారాలు నుంచి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ మంగళవారం కర్నూలుకు వెళ్లి జయమ్మకు పింఛన్ సొమ్ము అందించాడు. ఈసందర్భంగా ఎంపీడీఓ నిర్మలాకుమారి వలంటీర్‌ను అభినందించారు.

దివ్యాంగులకు ఇళ్లు మంజూరు చేయాలి

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు నూతన గృహాలను మంజూరు చేయాలని గౌతమిపురి దివ్యాంగుల మండల సమాఖ్య అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీలతకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులకు సర్వే నంబర్ 517-సీలో 2008లో ఇంటి పట్టాలను ఇచ్చారన్నారు. గతంలో పట్టాలు ఇచ్చిన భూమిలో ఇళ్లు మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు వినతి పత్రాలు కూడా ఇచ్చామన్నారు. వెంటనే అధికారులు స్పందించి సర్వే నంబర్ 517-సీ లోని భూమిని చదును చేసి గృహాల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

నేటి నుంచి శుడిబండి తిరునాల

పామిడి : రామరాజుపల్లిలో బుధవారం నుంచి ఆదివారం వరకూ వరుసగా ఐదు రోజులపాటు శుడిబండి(బండిశిల) తిరునాల నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు, ఎంపీపీ భోగాతి మురళీమోహన్ రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, జయరామిరెడ్డి, కంబగిరిరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. బుధవారం రథాన్ని రామరాజుపల్లి ఎద్దులు, చుట్టుపక్కల గ్రామాల ఎద్దులతో కాశేపల్లి మీదుగా గుత్తి అనంతపురం వైపునకు లాగిస్తారన్నారు. ఆ సమయంలో ఈ రథం వెంబడి సుంకులమ్మ, ముత్యాలయ్య దేవతా విగ్రహాలను చిలకమ్మ పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్తారన్నారు. బుధవారం రాత్రికి ఆ గ్రామం చేరగానే గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారన్నారు. బండిశిల గురువారం రాత్రికి రామరాజుపల్లికి, తిరిగి శుక్రవారం రాత్రికి బయలుదేరి శనివారం గుత్తి అనంతపురం చేరుతుందన్నారు. ఆరోజు రాత్రి అక్కడ నుంచి బయలుదేరి ఆదివారం తెల్లవారుజామున రామరాజుపల్లికి చేరడంతో తిరునాల ముగుస్తుందన్నారు.

చౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు


విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మంగళవారం పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈసందర్భంగా అర్చకులు ఎమ్మెల్యే కు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించడంతోపాటు ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ హరినాథరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, జెడ్పీటీసీ బాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చితంబరరెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ పెద్ద ఓబుళరెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, బీసీ విభాగం నేత వెంకటస్వామిగౌడ్, శేషారెడ్డి, దిమ్మగుడి మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, చిట్టూరు నాగభూషణ, చిన్నవడుగూరు సర్పంచ్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం డబ్బు కాజేసిన మహిళ వివరాల సేకరణ

గుంతకల్లు రూరల్: రైతుల ధాన్యం డబ్బు కాజేసిన మహిళ ఆస్తుల వివరాలను సేకరించాలంటూ మార్క్‌ఫెడ్ సంస్థ జిల్లా మేనేజర్ పెన్నీశ్వరి సూచించినట్లు మంగళవారం తహసీల్దార్ రాము తెలియజేశారు. మార్క్‌ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్న గుంతకల్లు శ్రీచైతన్య సంఘం అధ్యక్షురాలు తులసీబాయి 2021లో యల్లనూరు మండలం తిమ్మంపల్లి, సింగవరం గ్రామాలకు చెందిన 11 మంది రైతుల వద్ద నుంచి 210 క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యాన్ని సేకరించినట్లు ఆయన తెలిపారు. నెలరోజుల్లోగా రైతులకు ధాన్యానికి సంబంధించిన రూ.7 లక్షల నగదును చెల్లిస్తామని చెప్పడమే కాకుండా ఒక అగ్రిమెంటును సైతం రాసి ఇచ్చిందన్నారు. నెలలు గడచినా ధాన్యం డబ్బు ఇవ్వకపోవడంతో రైతులు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారన్నారు. రైతులకు ఇవ్వాల్సిన డబ్బు తులసీబాయి వాడుకున్నట్లు విచారణలో తేలడంతో మార్క్‌ఫెడ్ సంస్థ ఆమెకు పలుమార్లు నోటీసులు పంపించిందని, అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మరోసారి తులసీబాయికి నోటీసులు అందజేసిన మార్క్‌ఫెడ్ సంస్థ జిల్లా మేనేజర్ పెన్నీశ్వరి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తులసీబాయి ఆస్తుల వివరాలను సేకరించాలంటూ తనకు సూచించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి దాతృత్వం



చెక్కును వీసీ రంగజనార్దనకు అందిస్తున్న రిజిస్ట్రార్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ పి. సుజాత

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి పి. పరంధామయ్య రూ.10 లక్షల విరాళాన్ని మంగళవారం ప్రకటించారు. ఈ మొత్తాన్ని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి వెచ్చించాలని తెలిపారు. తిరుపతి జిల్లా గూడూరు ప్రాంతానికి చెందిన పరంధామయ్య 1970లో జేఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఏపీఎస్‌పీడీసీఎల్‌లో డీఈగా పదవీ విరమణ చేసిన పరంధామయ్య.. తాను ఉన్నత స్థాయికి చేరడానికి దోహదపడిన కళాశాలకు రూ.10 లక్షల విరాళాన్ని అందించడం అభినందనీయమని వీసీ జింకా రంగజనార్దన తెలిపారు. ఈ మొత్తాన్ని ప్లాటినమ్ జూబ్లీ హాస్టల్ భవన నిర్మాణానికి కేటాయించాలన్నారు. చెక్కును రిజిస్ట్రార్ సి.శశిధర్, జేఎన్‌టీయూ అనంతపురం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత జేఎన్‌టీయూ అనంతపురం వీసీకి అందించారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం. విజయకుమార్, జేఎన్‌టీయూఏ విశ్రాంత ప్రొఫెసర్ వి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

అనంతపురం సెంట్రల్: ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని పిలుపునిచ్చారు. నగరంలో ఆర్టీసీ కార్యాలయంలో ప్రమాదాల నివారణ, ఇంధన పొదుపు ఆవశ్యకతపై ఐదు రోజుల పాటు ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఆర్ఎం మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని పూర్తి స్థాయిలో అరికట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రైవర్లందరూ ఏకాగ్రతతో బస్సులు నడపాలన్నారు. ట్రైనర్ జేవీ రావు రోజూ సర్వీసులు సరైన సమయంలో నడిపే విధంగా డ్రైవర్లకు సూచనలు చేశారు. డిప్యూటీ సీఎంఈ మోహన్‌కుమార్, డిపో మేనేజర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశిష్ట పుష్పయాగం


పుష్పయాగంలో పాల్గొన్న 108 మంది దంపతులు

గుంతకల్లు: వాసవీ జయంత్యుత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో విశిష్ట పుష్పయాగం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వేకువజామునే వాసవీ మాతను విశేషంగా అలకరించారు. అనంతరం విష్ణు సహస్ర నామ పారాయణము గావించారు. తర్వాత 108 మంది దంపతులతో వాసవీ మాత ఉత్సవ విగ్రహానికి విశేష పుష్ప యాగం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపా జగదీష్, నాయకులు కృపాకర్, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


అలంకరణలో వాసవీమాత

పెన్షనర్లందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలి

గుత్తి: గుత్తి తాలూకా పరిధిలోని పెన్షనర్లందరూ ఈ- కేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు అబూబకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ లోపు గుత్తిలోని సబ్ ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు: ఉపాధి హామీ కింద పండ్ల తోటల పెంపకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ యోగానందరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. 16 రకాల పండ్ల తోటలను సాగు చేసుకోవడానికి అవకాశం ఉందని, నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సచివాలయం తనిఖీ

పుట్లూరు: మండలంలోని అరకటివేముల గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీఓ యోగానందరెడ్డి తనిఖీ చేశారు. సచివాలయంలోని రిజిస్టర్లను పరిశీలించి పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.